Postal License No.VJ/220/2023-25



నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వార పత్రిక

TELUGU ONLINE
DIGITAL NEWS
PORTAL &
ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 1-7 జూన్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 51 | పేజీలు : 4 | రూ. 5.00

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**-ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : 'పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత కావాలి. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. చెట్లను పెంచని వారు స్వచ్ఛమైన గాలిని ఆశించడం సమంజసమా? పర్యావరణాన్ని కాపాడటంలో దేశానికే ఆదర్శంగా ఏపీని తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తుళ్లూరు మండలం అనంతవరంలో చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడీసీఎల్ పార్కులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొక్కలు నాటారు. సభా వేదిక వద్ద పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

**2047 నాటికి 50 శాతం పచ్చదనం..** 'ఒక్కరోజే కోటి చెట్లను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్నిస్తోంది. వచ్చే పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్రంలో 5.58 కోట్ల మొక్కలు పెంచాలని సంకల్పించాం. రాష్ట్రంలో 37,421 చదరపు కిలోమీటర్ల పరిధిలో అడవులున్నాయి. రాష్ట్ర విస్తీర్ణంలో ఇది 23 శాతం. అటవీయేతర ప్రాంతంలోని పచ్చదనంతో కలిపి రాష్ట్రంలో 30.05 శాతం పచ్చదనముంది. దీన్ని 2047 నాటికి 50 శాతానికి తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకున్నాం. పచ్చదనంలో మనం దేశానికే ఆదర్శంగా నిలవాలి. గత పాలకులు ఫొటోల కోసమే చెట్లు నాటేవారు. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్ విసురుతోంది. వర్షాలు కురవడం తగ్గిపోయింది. భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. సాగు ప్రమాదంలో పడుతోంది. ఫ్లోరైడ్ పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి.

**నా మనసుకు దగ్గరగా పర్యావరణ శాఖ..** 'గత ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వస్తున్నాడంటే కింద రోడ్ల పక్కనున్న చెట్లు నరికేసేవారు. మేం పర్యటనలకు వస్తుంటే ఎక్కడైనా చెట్లు నరుకుతున్నారా? చెట్లు పెంచడం మన బాధ్యత... నరకడం దుర్మార్గం. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే జైళ్లలో పెడతారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు నరక్కూడదు. వనజీవి రామయ్య నా దగ్గరకు ఎప్పుడు వచ్చినా మొక్క తెచ్చేవారు. ఆయన జీవితమంతా ఊరూరా తిరిగి మొక్కలు పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన మనందరికీ స్ఫూర్తి. నా చిన్నతనంలో మా గ్రామంలో కేశవ నాయుడు అనే సామాజిక కార్యకర్త కూడా అడవులు నరక్కుండా తీసుకున్న చర్యలు నాలో స్ఫూర్తి నింపాయి. అలాగే నా మనసుకు దగ్గరైన పర్యావరణ శాఖను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించడం సంతోషాన్నిస్తోంది.

**'సీడ్ రాఖీ'తో ఆడబిడ్డలు పర్యావరణానికి దోహద పడాలి..** ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం. ప్రకృతిని నాశనం చేస్తోంది. పశువులు ప్లాస్టిక్ తింటే.. వాటి పాలు మనం తాగుతున్నాం. కుళ్లిన చికెన్‌ను చేపలకు మేతగా వేస్తున్నారు. అందుకే పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా... స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. గుంటూరు, విశాఖలో చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వం దీనిపైన నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పట్టణాల్లో 90 శాతం పొడి చెత్తను ఎనర్జీకి ఉపయోగిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో వేస్ట్ కంపోస్టు కేంద్రాలు నెలకొల్పాం. రీ సైక్లింగ్ కింద ఇప్పటికే 87 మున్సిపాలిటీల్లో 157 రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి 17 కార్పొరేషన్లు, వచ్చే ఏడాది జూన్ 5 నాటికి మొత్తం రాష్ట్రాన్ని'సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ రహితంగా మార్చుతాం. 175 నియోజకవర్గాల్లోనూ నగర వనాలు ఏర్పాటు చేస్తాం. మీ అన్నదమ్ముల నక్షత్రాలకు చెందిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన సీడ్ రాఖీలను ఆడబిడ్డలంతా కట్టాలి.

**సుందర నగరంగా అమరావతి..** టీడీపీ, జనసేన, బీజేపీ ఏపీలో చరిత్ర సృష్టించి నిన్నటికి ఏడాది పూర్తయింది. విధ్వంసం నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం వైపు అడుగులు వేస్తున్నాం. వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ముందుకు వెళుతున్నాం. అమరావతి రాజధాని భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుంది. దేవతల రాజధానిలో మనం ఉంటడం అదృష్టం. సుందర నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం. మియావాకీ తరహా గార్డెన్లు సహా అనేక దేశాల గార్డెన్లు అమరావతిలో పెంచుతాం. ఒకప్పుడు కరెంటు లేని స్థితి నుంచి... ఇప్పుడు మీ ఇంటి పైనుంచి కరెంటు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు సోలార్ ప్యానెళ్లు ఉచితంగా అమరుస్తాం. గ్రీన్ ఎనర్జీలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతాం.

**సలహాదారుగా అంకారావు..** ఈ నెల 21వ తేదీన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నాం. అక్కడ ఒకేరోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేస్తాం. యోగా మన జీవితంలో భాగం కావాలి. ఆయుష్ ద్వారా యోగాను ప్రతి ఒక్క ఇంటికి చేర్చేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. నల్లమల అడువులను పరిరక్షిస్తున్న కొమెర అంకారావును అడవులు, పర్యావరణ శాఖ సలహాదారుగా నియమిస్తున్నాం' అని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## భవిష్యత్తులో మినీ మాల్స్ గా రేషన్ దుకాణాలు

కాకినాడ, నేటి పత్రిక ప్రజావార్త : 'ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భవిష్యత్తులో రేషన్ దుకాణాలను మినీ మాల్స్‌గా మారుస్తాం. బియ్యం ఒక్కటే కాకుండా రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాలు అందించే ఏర్పాటు చేస్తామ'ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 29,761 రేషన్ షాపుల ద్వారా ఉదయం నుంచి మొదటి నాలుగు గంటల్లో 8.15 లక్షల కుటుంబాలకు రేషన్ సరుకులు అందించినట్లు వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆదివారం కాకినాడ రూరల్ నియోజకవర్గం వాకలపూడిలో చౌక ధరల దుకాణం వద్ద రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కృష్ణశెట్టి గోపాల్ అనే వృద్ధుడు ఇంటికి వెళ్లి స్వయంగా రేషన్ సరకులు అందించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ అనేది దశాబ్ధాలుగా బలమైన వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తీసుకున్న నిర్ణయం. ఈ వ్యవస్థ ప్రతి గ్రామం, వార్డులో బలంగా నాటుకుపోయింది. ఆదివారాలు, పండగలతో సంబంధం లేకుండా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంచి సరుకులు పంపిణీ చేసేవారు. అటువంటి వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసింది. వైసీపీ పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యమైంది. దశాబ్ధలుగా చక్కగా నడుస్తోన్న వ్యవస్థను వైసీపీ నాయకులు స్వలాభం కోసం పక్కదారి పట్టించారు. ప్రజలు ప్రశ్నించలేని విధంగా గత ఐదేళ్లు పాలన సాగింది. ఇంటింటికి రేషన్ పేరిట ప్రజా ధనం దాదాపు రూ.1650 కోట్లు ఖర్చు చేసి 9260 ఎండీయూ వాహనాలు కొనుగోలు చేశారు. ఈ వాహనాల వల్ల వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనం కలుగకపోగా, బియ్యం అక్రమ రవాణాకు దారి తీసింది. ఎండీయూ వాహనాలు ఎప్పుడు ఎక్కడికి వస్తాయో ఎవరికీ సరైనా సమాచారం ఉండేది కాదు. వీధి చివర ఒక గంట నిలబడి వెళ్లిపోయేవారు. రేషన్ ఎందుకు ఇవ్వలేదని మహిళలు ఆవేదనతో అడిగితే మేము వెయిట్ చేశాం... మీరే రాలేదని సమాధానం చెప్పేవారు. మూడు రేషన్ దుకాణాల నుంచి ఎండీయూ వాహనాలు సరుకులు తీసుకునేవి. ఆ సరుకులు ఎవరికి పంపిణీ చేశారో లెక్కాపత్రం ఉండేది కాదు. వైసీపీ హయాంలో అవినీతి ఏ స్థాయిలో ఉండేది అంటే ఐదు నెలల నుంచి మూలన పడ్డ వాహనాలు కూడా రేషన్ డెలివరీ చేసినట్లు లెక్కలు చూపించారు. మేము ఉదయం నుంచి కష్టపడితే ఇప్పుటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 8.15 లక్షల కుటుంబాలకు రేషన్ సరుకులు అందించాం. అదే వైసీపీ హయాంలో ఒక్క రోజులోనే ఇంటింటికి వెళ్లి 93 శాతం రేషన్ అందించామని లెక్కలు చూపించి ప్రజలను మభ్య పెట్టేవారు.

## ఎంత నష్టం జరిగిందన్నది కాదు... ఎలాంటి ఫలితాలు సాధించామన్నదే ముఖ్యం: త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆపరేషన్ సిందూర్ సమయంలో కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు అంగీకరించిన కొద్ది రోజులకే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నికార్సయిన సైనిక దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని ఆయన స్పష్టం చేశారు. యుద్ధంలో నష్టాల కంటే ఫలితాలే ముఖ్యమని నొక్కిచెప్పారు. సావిత్రిబాయి ఫులే పుణే విశ్వవిద్యాలయంలో 'భవిష్యత్ యుద్ధాలు - యుద్ధరీతులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తూ జనరల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "వృత్తిపరమైన దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని నేను భావిస్తున్నాను. యుద్ధంలో ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ, మనోధైర్యం ఉన్నతంగా ఉండటం చాలా ముఖ్యం. పరిస్థితులకు తగ్గట్టుగా మారగలగడం అనేది వృత్తిపరమైన సైనిక శక్తికి ముఖ్యమైన లక్షణం. ఏం తప్పు జరిగిందో అర్థం చేసుకోగలగాలి, తప్పును సరిదిద్దుకుని మళ్ళీ ప్రయత్నించాలి. భయంతో కూర్చోకూడదు" అని అన్నారు. పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే క్రమంలో, మే 7న జరిగిన ప్రతిఘటనలో భారత్ కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని జనరల్ చౌహాన్ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. ఆ నష్టం తర్వాత భారత దళాలు తమ వ్యూహాలను మార్చుకుని, సరిహద్దుకు ఆవల ఉన్న పాక్ వైమానిక స్థావరాలకు భారీ నష్టాన్ని కలిగించాయని ఆయన వివరించారు. "మే 7న, ఆరంభ దశలో నష్టాలు జరిగాయని నేను చెప్పగలను" అని జనరల్ చౌహాన్ గతంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఘటన ఆధునిక ప్రపంచానికి ఆమోదయోగ్యం కాదని ఆయన తీవ్రంగా ఖండించారు. "పహల్గామ్‌లో జరిగింది బాధితుల పట్ల తీవ్రమైన క్రూరత్వం. ఎందుకంటే వారందరినీ వారి కుటుంబ సభ్యులు, పిల్లల ముందే తలపై కాల్చి చంపారు. మతం పేరుతో వారిని కాల్చిచంపడం ఈ ఆధునిక ప్రపంచానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. పాశ్చాత్య దేశాలు ఒకటి లేదా రెండు ఉగ్రవాద చర్యలను ఎదుర్కొని ఉండవచ్చు. కానీ భారత్ అత్యధిక ఉగ్రవాద దాడులకు గురైంది, దాదాపు 20,000 మంది ప్రాణాలు కోల్పోయారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, అది కొనసాగుతోందని సీడీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. "ఇది శత్రుత్వాల తాత్కాలిక విరమణ మాత్రమే. మనం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది," అని ఆయన అన్నారు. పాకిస్థాన్ విషయానికొస్తే, నేను రెండు అంచనాలు వేయగలను. ఒకటి, వారు చాలా దూరం నుంచి వేగంగా ఆయుధాలను కోల్పోతున్నారు, ఇది మరికొంత కాలం కొనసాగితే, వారు మరింత నష్టపోయే అవకాశం ఉందని వారు భావించి ఉండవచ్చు, అందుకే వారు కాల్పుల విరమణకు ప్రతిపాదించి ఉంటారు" అని జనరల్ అనిల్ చౌహాన్ విశ్లేషించారు.

## బుడమేరు వరదకు శాశ్వత నివారణగా సిసివాల్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : గతంలో బుడమేరు వరదకు పడిన మూడు గండ్లను కలుపు తూ నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు నత్తనడక సాగడంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడు సార్లు స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి, సీజన్ మొదలయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పనులు నెమ్మదించడంతో ఏజెన్సీకి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, సిఈ సుగుణాకరరావులతో కలసి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. గతేడాది వచ్చిన బుడమేరు వరదల వల్ల విజయవాడ తీవ్రముంపుకు గురైందని, ఆగండ్లను పూడ్చడానికి గట్లపైనే ఉండి రాత్రింభవళు పనిచేశామని, స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం పది రోజులు బస్సులోనే ఉండి పర్యవేక్షించారని గుర్తు చేశారు. గతంలో కూడా పులివాగుకు వరదలు వచ్చిన సమయంలో ఇదే ప్రాంతంలో పలు మార్లు గండ్లుపడ్డాయని అధికారులు, స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం గతంలో పడిన మూడు గండ్లను కలుపుతూ శాశ్వతప్రాతిపదికన సిసి వాల్ నిర్మాణం కొరకు 23 కోట్ల రూపాయల అగ్రిమెంట్ వాల్యూతో టెండర్లు కూడా పిలిచి పనులు కూడా చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. ఐతే పనులు నెమ్మదిగా సాగుతుండటం, సరిపడినంత మెషినరీగానీ, సిబ్బంది గానీ లేకపోవడంతో ఏజెన్సీ, అధికారులపై మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా పనులు పూర్తి చేయడానికి వీలుగా సరిపడినంత మెషినరీ గానీ, సిబ్బంది గానీ సమకూర్చుకుని మూడు షిఫ్ట్ లలో, రాత్రి పగలు, పనులు చేయాలని ఆదేశించారు. వర్క్ షెడ్యూల్ ను రోజువారీ వేసుకుని, ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని హెచ్చరించారు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో లేదు: అమెరికా



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారతదేశం-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుంకాల ప్రతిష్టంభన నేపథ్యంలో చర్చలు ఊపందుకున్నాయని, రెండు దేశాలకూ ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రయోజనాలపై ఏకాభిప్రాయం కుదిరిందని అమెరికా వాణిజ్య కార్యదర్శి హెూవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో వార్షిక సదస్సులో పాల్గొన్న లుట్నిక్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సమీప భవిష్యత్తులోనే కుదురుతుందని మీరు ఆశించవచ్చు" అని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను వేగవంతం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వాణిజ్య లోటుకు కారణమవుతున్నాయన్న ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, చైనా మినహా ఇతర దేశాలపై ఈ సుంకాలను జులై 8 వరకు 90 రోజుల పాటు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తమ వస్తువులపై అమెరికా విధించిన 26 శాతం అదనపు సుంకం నుంచి భారత్ పూర్తి మినహాయింపు కోరుతోంది. ఈ నేపథ్యంలో జులై 8 లోపు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయని వార్తలు వస్తున్న తరుణంలో లుట్నిక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత్, అమెరికా పరస్పరం ఒకరి వ్యాపారాలకు మరొకరు ప్రాధాన్యంతో కూడిన మార్కెట్ ప్రవేశం కల్పించాలని కోరుకుంటున్నాయని, ఇరు దేశాల బృందాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. కాగా, ప్రతిపాదిత మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌లో పర్యటిస్తోంది. గత నెలలో, భారత ప్రధాన సంప్రదింపుల అధికారి, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో నాలుగు రోజుల పర్యటన ముగించారు. వాణిజ్య చర్చలకు మరింత ఊతమిచ్చేందుకు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కూడా ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు.

## అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపు

**2026 జనవరికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ సిద్ధమని ప్రకటన**

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఢిల్లీ వేదికగా జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆర్థికాభివృద్ధి - సుస్థిరత - ఆంధ్రప్రదేశ్ బ్లూప్రింట్ అనే అంశంపై సీఐఐ స్పెషల్ ప్లీనరీ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఇదే సందర్భంలో పారిశ్రామికవేత్తలు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడులకు ఉన్న అవకాశాలు.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు.. రూపొందించిన విధానాలను సీఎం వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047లో పారిశ్రామిక భాగస్వామ్యాన్ని కోరుతున్నట్టు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుతం సీబీఎన్ అనే బ్రాండ్ ద్వారా ఏపీకి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. క్రెడిబిలిటి అనేది రాత్రికి రాత్రి వచ్చేది కాదు. ఏపీకి రండి.. పరీక్షించండి.. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి. 2026 దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతిలో ఏర్పాటు అవుతుంది. దీన్ని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలి. క్యాంటం కంప్యూటింగ్ విస్తృతం అవుతోంది. డ్రోన్స్, ఐఓటీ, సెన్సార్లు ఇలా వివిధ రకాల సాంకేతికతతో రియల్ టైమ్ డేటా అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం ఈ రంగాల్లో పెట్టుబడిదారులు అవసరం. భవిష్యత్తులో ఈ రంగానికి మంచి డిమాండ్ ఉంది. దీనికి అమరావతి కేంద్రం కానుంది. టీసీఎస్,ఐబీఎం,ఎల్ అండ్ టీ సంస్థలు సంయుక్తంగా అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నదే మా నినాదం. బీపీసీఎల్ రిఫైనరీ రామాయపట్నం వద్ద వస్తోంది. డేటా సెంటర్ , అనలటిక్స్ తో కూడిన క్యాంపస్ విశాఖలో ఏర్పాటు చేయాలని గూగుల్ ను ఆహ్వానించాం. పారిశ్రామిక వేత్తలు ఎవరు వచ్చినా వారికి ఎర్రతివాచీతో ఆహ్వానం పలుకుతాం. ధరఖాస్తు పెట్టినప్పటి నుంచి భూ కేటాయింపు, ఇతర అనుమతులివ్వటం మా బాధ్యత. రికార్డు టైములోనే అన్ని క్లియరెన్సులు ఇస్తామని మీకు హామీ ఇస్తున్నాం. ఏపీలో ఇప్పుడు సౌర,పవన,పంప్డ్ ఎనర్జీ లాంటి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కేంద్రంగా మారుతోంది. పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఈ రంగాల్లో వస్తున్నాయి. రాయలసీమలో కొత్తగా హైటెక్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం. ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతిలో ఫ్యూచర్ లీడర్లను తయారు చేయడం కోసం గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం." అని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలకు వివరించారు.

## రూ.3,673 కోట్లతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3,673 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి ఎల్-1 టెండర్లను ఖరారు చేస్తూ సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రూ.882 కోట్లతో నిర్మించే జిఎడి టవర్ నిర్మాణాన్ని ఎన్.సి.సి., రూ.1,487 కోట్లతో నిర్మించే హెచ్.ఓ.డి. టవర్-1&2 నిర్మాణాన్ని షాపూర్జీ అండ్ పల్లంజీ మరియు రూ.1,304 కోట్లతో నిర్మించే హెచ్.ఓ.డి. టవర్-3&4 నిర్మాణాన్ని ఎల్ అండ్ టి కంపెనీలు దక్కించుకున్నాయని, త్వరలో నిర్మాణ పనులను కూడా ఆయా కంపెనీలు ప్రారంభిస్తాయని ఆయన తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన 48 వ సీఆర్డీఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిందని, ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించిన పలు టెండర్లను ఆమోదించడం జరిగిందన్నారు. ప్రజలు పలుచోట్లకు తిరుగకుండా ప్రజా పరిపాలన సులువుగా ఉండేందుకై పరిపాలన అంతా ఒకేచోట జరిగే విధంగా ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. 2014-19 మధ్య కాలంలో రూపొందించిన డిజైన్ల ప్రకారమే ఈ టవర్ల నిర్మాణాల పనులు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. గ్రామసభలు నిర్వహిస్తూ రైతుల అభిప్రాయాన్ని సేవకరించడం జరుగుచున్నదన్నారు. ఈ గ్రామ సభలో రైతులు ల్యాండ్ పూలింగ్ కే మొగ్గుచూపుతున్నారని, ఇప్పటికే దాదాపు 36 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చేందుకు పలువురు రైతులు ముందుకు రావడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి కావలసిన 10 వేల ఎకరాలకు గాను రైతుల నుండి దాదాపు 40 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే అమల్లో ఉన్న ల్యాండ్ పూలింగ్ చట్టంలోని నియమ నిబంధనల మేరకు 217 చ.కి.మి. కే అనుమతి ఉందని, ఈ పరిధిని మరింత పెంచేందుకు నేడు జరిగిన అథారిటీ సమావేశంలో ఆమోదం పొందడం జరిగరిదని ఆయన తెలిపారు.

## వ్యాపారవేత్తలుగా కుల వృత్తుదారులు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కుల వృత్తుదారులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా మూడో విడత ఆదరణ పథకం కింద అధునాతన పరికరాలు అందివ్వనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, చేనేత మరియు జౌళి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణతో కుట్టు మిషన్లు అందజేస్తోందన్నారు. కుట్టు శిక్షణకు హాజరవుతున్న మహిళలను పథకంపై సంతృప్తి వ్యక్తం చేస్తుండడంపై మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. కుట్టు శిక్షణా కేంద్రాలను తరుచూ సందర్శించాలని ఈడీలకు మంత్రి సవిత ఆదేశించారు. లబ్ధిదారుల హాజరు వంద శాతం ఉండేలా చూడాలని, పకడ్బందీగా ఎఫ్.ఆర్.సి చేయించాలని స్పష్టంచేశారు. మహిళలకు అత్యుత్తమ శిక్షణ అందివ్వడంతో పాటు వారు తయారు చేసే వస్త్రాలకు మార్కెట్ సదుపాయం కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. మూడో విడత ఆదరణ పథకం కింద కుల వృత్తుదారులకు సంప్రదాయ పరికరాలకు బదులు అధునాతన పరికరాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సవిత తెలిపారు. కుల వృత్తుదారులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఆదరణ-3 అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాంతాల వారీగా లబ్ధిదారులు ఎటువంటి పరికరాలు ఆశిస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. ఆ వివరాలను రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. కుల వృత్తుదారులకు సద్వినియోగమయ్యేలా ఆదరణ-3 అమలు చేయబోతున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఉమ్మడి జిల్లాలకు ఈడీలు, బీసీ కార్పొరేషన్ అధికారులు హాజరయ్యారు.

## కమీషన్ పట్ల మహిళలకు సన్నగిల్లిన నమ్మకాన్ని పెంచుతున్నాం



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : మహిళలకు గౌరవం పెంచే లక్ష్యంతోనే మహిళా కమీషన్ సమర్ధవంతంగా పని చేస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకం వలన మహిళలపై దాడులు, వేధింపులు, అన్యాయాల పట్ల మహిళా కమీషన్ నిశ్తేజమయ్యింది. అందుకే కమీషన్ మీద మహిళలకు నమ్మకం సన్నగిల్లింది. మహిళా కమీషన్ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా అవగాహన పెంచేందుకు ప్రణాళిలు సిద్ధం చేశాం. ఘోరాలు జరిగిన వెంటనే బాధితులతో మాట్లాడి అండగా నిలుస్తున్నాం. నిందితులకు శిక్ష పడేలా చేస్తున్నాం. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, ఘోరాలు జరగకుండా ఉండేందుకు అధికారులతో సమీక్షిస్తున్నాం. ఏ ఒక్క ఆడబిడ్డకు అన్యాయం జరిగినా మహిళా కమీషన్ చూస్తూ ఊరుకోదు అనే ధైర్యం మహిళలకు కలిగేలా కృషి చేస్తున్నాం. సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడంలో మహిళా కమిషన్ కీలకపాత్ర పోషిస్తోంది. గతంలో మాదిరిగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఈ సారి మహిళా కమిషన్ రాజకీయ నిర్లిప్తతను అనుసరిస్తూ, న్యాయాధిష్ఠితంగా సాగుతోంది. అధికార, విపక్ష పార్టీలకు సంబంధం లేకుండా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. చట్టపరంగా మహిళల రక్షణకు ఉన్న హక్కుల అమలులో మహిళా కమిషన్ ఎప్పుడూ ముందుంటుంది. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం నుంచి దర్యాప్తు అధికారులు చర్యలు తీసుకునే వరకూ కమిషన్ పర్యవేక్షణ లోపించకుండా పని చేస్తుంది. ఐపీసీ సెక్షన్లు, POCSO, DV, POSH యాక్ట్ వంటి చట్టాలపై పల్లెల్లోని యువతులకు, కార్మిక మహిళలకు చట్ట పరిరక్షణపై అవగాహన కల్పిస్తాం. వాటితో పాటు స్కూళ్లు, కళాశాలల్లో బాలికలకు చట్టాలు, న్యాయాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మునుపెన్నడు చూడని విధంగా ఒక సమర్ధవంతమైన మహిళా కమీషన్ ను ప్రజలకు సరికొత్త రీతిలో పరిచయం చేస్తాం. మహిళలకు భరోసాను ఇస్తాం. బాధితులకు అండగా నిలుస్తాం. మహిళల హక్కులు, రక్షణ, సంక్షేమం కోసం పనిచేసే మహిళా కమిషన్ రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా ఉండాల్సిన అవసరం ఉంది అని రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ శైలజ రాయపాటి అన్నారు

# విపత్తు నిర్వహణకు స్పేస్ టెక్నాలజీ సాయం...




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వ పాలనలో స్పేస్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగువేసింది. ఇందులో భాగంగా సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఇస్రో–ఆర్టీజీఎస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఐదేళ్ల పాటు సాగే ఈ ఒప్పందం ద్వారా శాటిలైట్ చిత్రాలు, శాస్త్రీయ సమాచారంతో AWARE ప్లాట్‌ఫామ్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నారు. ఇది వ్యవసాయం, వాతావరణం, విపత్తుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల్లో 42కి పైగా అప్లికేషన్లలో పనిచేయనుంది. ఆధునిక సాంకేతికతలను సమన్వయం చేసి... విపత్తుల నిర్వహణలో మెరుగైన ఫలితాలు అందించి ప్రజల భద్రతకు దోహదపడుతుంది. AWARE ప్లాట్‌ఫామ్ శాటిలైట్‌లు, డ్రోన్లు, IoT పరికరాలు, సెన్సార్లు, మొబైల్ ఫోన్ల ఫీడ్, సీసీటీవీ వంటి వనరుల నుంచి డేటాను సమగ్రంగా సేకరించి ప్రజలకు SMS, WhatsApp రూపంలో తక్షణ హెచ్చరికలు, సూచనలు చేస్తుంది. ఈ ఒప్పంద ద్వారా ముఖ్యంగా విపత్తు నిర్వహణలో ప్రజలకు అత్యంత ఖచ్చితమైన సమాచారం త్వరితగతిన చేరవేసే అవకాశం లభిస్తుంది. ఇస్రో డైరెక్టర్ రాజరాజన్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ మధ్య జరిగిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

**లక్ష మంది టెక్ అప్రెంటీస్ ల శిక్షణా కార్యక్రమం...** దేశవ్యాప్తంగా ఐటీ పరిశ్రమ స్థితిగతులు, ఏపీలో టెక్ అవకాశాలపై నాస్కామ్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. సచివాలయంలో నాస్కామ్ అధ్యక్షుడు రాజేష్ నంబియార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శ్రీనివాసన్ , నాస్కామ్ ఆర్ అండ్ డీ హెడ్ శివప్రసాద్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఐటీ రంగంలో ఏపీని ముందుకు తీసుకువెళ్లేందుకు స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పన, నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని ప్రోత్సహించాల్సిన అంశాలపై సీఎం నాస్కామ్ ప్రతినిధులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో సాంకేతికత జోడింపు వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఐటీ పరిశ్రమకు అవసరమైన టెక్ నిపుణుల్ని తయారు చేసేందుకు టెక్ అప్రెంటీస్ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా నాస్కామ్ ను సీఎం కోరారు. ఆంధ్రప్రదేశ్ లో లక్ష మంది టెక్ అప్రెంటిస్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించటం ద్వారా ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

**విశాఖ, తిరుపతిలలో ఏఐ డిస్ట్రిక్ట్ టెస్ట్ బెడ్స్...** విశాఖ, తిరుపతిలో జిల్లా స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిస్ట్రిక్ట్ టెస్ట్ బెడ్ ఏర్పాటుకు నాస్కామ్ ప్రతిపాదన చేసింది. భూ సంబంధిత అంశాలు, వైద్యారోగ్యం, విద్యా రంగాల్లో ఓపెన్ ఏఐ ల్యాబ్ లు ఏర్పాటు చేసి పౌరసేవల్ని అందించొచ్చని వెల్లడించింది. బిల్డ్ ఇండియా ఇన్నోవేషన్ పైప్ లైన్ కార్యక్రమాన్ని బలోపేతం చేసేలా ఏపీలో గ్రామీణ టెక్ సొల్యూషన్స్ కు అవకాశం ఉందని నాస్కామ్ వివరించింది. వ్యవసాయం, వైద్యారోగ్యం, వాతావరణం ఇతర అంశాల్లో ఏఐ సాంకేతికతతో వందకు పైగా గ్రామీణ స్టార్టప్స్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు నాస్కామ్ ప్రతినిధులు సీఎంకు వివరించారు.

# మంగళగిరిలో త్వరలోనే రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీ..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : మంగళగిరి నియోజకవర్గంలో త్వరితగతిన రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఏడాది కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి మొదటి విడతగా సుమారు 3 వేల మందికి శాశ్వత పట్టాలు అందజేయడం జరిగింది. రెండో విడతలో 2,500 ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలి. రైల్వే, కాలువ, అటవీ, దేవాదాయ భూముల విషయంలో నెలకొన్న సమస్యలను తర్వితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మంగళగిరిలో యూ1, ఐ2 జోన్లు, భవన నిర్మాణ అనుమతులు సీఆర్డీయే నుంచి ఎంటీఎంసీకి బదిలీ చేసే అంశంపైనా సమావేశంలో చర్చించారు.

**భూగర్భ డ్రైనేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టులకు నిధుల సమీకరణపై చర్చ...** మంగళగిరి నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, స్టోమ్ వాటర్ డ్రైన్స్, తాగునీరు, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. ఆగష్టు నాటికి ఆయా ప్రాజెక్టుల డీపీఆర్ లను పూర్తిచేసి అన్ని పనులు ఒకేసారి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల సమీకరణపై అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. డిజైన్స్ ను పకడ్బందీగా తయారుచేయాలని మంత్రి ఆదేశించారు.

**పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టండి...** మంగళగిరి నియోజకవర్గంలో పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద 37వేల దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన రుణ సదుపాయం కోసం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

**నవంబర్ లో మంగళగిరి-తెనాలి-నారాకోడూరు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం...** నిత్యం రద్దీగా ఉండే మంగళగిరి–తెనాలి–నారాకోడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. జులై 15 నాటికి డీపీఆర్ సిద్ధం అవుతుందని, ఈ ఏడాది నవంబర్ లో పనులు ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అధికారులు రూపొందించిన వివిధ ప్రణాళికలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. గుంటూరు–బాపట్ల రహదారి నిర్మాణంపైనా సమావేశంలో చర్చించడం జరిగింది.

చినకాకాని ఐటీ పార్క్, మోడల్ స్కూల్ గా నిడమర్రు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, మంగళగిరిలో వీవర్స్ శాల, పార్క్ ల అభివృద్ధి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలతో పాటు పెనుమాక, మంగళగిరి, దుగ్గిరాలలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం, నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిటీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణంపైనా సమావేశంలో చర్చించారు. అండగ్ వాడీ కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, గుంటూరు ఇంఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాష, ఏడీసీఎల్ సీఈ ప్రభాకర్, మంగళగిరి సీపీడీసీఎల్ ఏడీఈఈ సురేష్ బాబు, ఆర్ అండ్ బీ సీఈ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఈ ఎమ్.రాజేంద్ర ప్రసాద్, అధికారులు జేవీఆర్ రెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'తెలంగాణ రైజింగ్' తో నవశకానికి నాంది..


*తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ రేవంత్ సందేశం*



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్రం 11 వసంతాలు పూర్తిచేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చారిత్రక దినాన, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను ఆయన స్మరించుకున్నారు. వారి ఆత్మశాంతికి ప్రార్థిస్తూ, వారి త్యాగనిరతిని కొనియాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రేవంత్‌రెడ్డి నేడు తన సందేశాన్ని విడుదల చేశారు. "తెలంగాణ ప్రజలంతా ఐక్యంగా పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ఈ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తయ్యాయి. మనం ఇప్పుడు 12వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' అనే నినాదాన్ని ముందుకు తెచ్చిందని సీఎం వెల్లడించారు. ఈ నినాదం రాష్ట్ర ప్రగతికి, ప్రజల ఉన్నతికి అద్దం పడుతుందని అభిప్రాయ పడ్డారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. "రాష్ట్రం అన్ని రంగాల్లోనూ గణనీయమైన అభివృద్ధి సాధించి, యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తున్నాం" అని వివరించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, తెలంగాణను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని, ఈ దిశగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని





డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. 2014 జూన్ 2న తెలంగాణ ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో నేటితో రాష్ట్రం ఏర్పడి 11 యేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం విషెస్ తెలియజేస్తూ పోస్టులు పెట్టారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ కూడా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తోందని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు పురోగతిలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నా అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టారు. "రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు! ఈ యువ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆర్థిక మరియు సాంకేతిక అభివృద్ధి తాలూకు శక్తివంతమైన ఆధునిక పర్యావరణ వ్యవస్థను కలిగి ఉంది. తెలంగాణ ప్రజలు పురోగతి, శ్రేయస్సు మార్గంలో ముందుకు సాగాలని నేను కోరుకుంటున్నాను" అని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. మరోవైపు దేశ పురోగతికి లెక్కలేనంత కృషి చేసేలా తెలంగాణ ప్రసిద్ధి చెందిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల మెరుగైన జీవన సౌలభ్యానికి కేంద్రం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. "తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. జాతీయ పురోగతికి లెక్కలేనంత కృషి చేసేలా తెలంగాణ ప్రసిద్ధి చెందింది. గత దశాబ్దంలో రాష్ట్ర ప్రజల 'జీవన సౌలభ్యాన్ని' పెంచడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రజలను ఆ దేవుడు విజయం, శ్రేయస్సును ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని మోదీ ట్వీట్ చేశారు.

# తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం చంద్రబాబు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన ట్వీట్ చేశారు. "తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన, ఆకాంక్ష. 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తెలంగాణ ప్రజలకు నా శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో సాగాలని కోరుకుంటున్నాను. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్–2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలని, తెలుగు జాతి తిరుగులేని శక్తిగా నిలవాలని.. ఇందులో ప్రతి తెలుగు పౌరుడు భాగస్వామి కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని చంద్రబాబు తన 'ఎక్స్' పోస్టులో రాసుకొచ్చారు.

**నీ కలలు నిజం కావాలంటే,**
**నీ కృషి విరామం**
**తీసుకోకూడదు.**

# నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల తెలంగాణ



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా జనసేనాని పోస్ట్ పెట్టారు. తనలో ఉద్యమ స్ఫూర్తిని, జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల తెలంగాణ అని పవన్ పేర్కొన్నారు. "జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు, దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా... విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాలలో సంక్షేమాభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# జగన్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారు..




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ తీరుపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులను జగన్ పరామర్శించడం దిగజారుడు ఓట్ల రాజకీయాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప హత్యలు ఉండవనేది జగన్ లాంటి వారిని చూసే పుట్టింది. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించి ఆయన రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారు" అని రఘురామ వ్యాఖ్యానించారు. పోలీసులపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులకు జగన్ అండదండలు అందించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి చర్యల ద్వారా జగన్ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. గతంలో తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు, జగనే తనను కస్టడీలో కొట్టించారని రఘురామ సంచలన ఆరోపణ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జగన్‌ను చూసి జాలిపడటం తప్ప ఏమీ చేయలేమని ఆయన అన్నారు. "నేరగాళ్లను వెనకేసుకొచ్చే నాయకుడు దొరకడం వైసీపీ నేతల అదృష్టం" అంటూ రఘురామ ఎద్దేవా చేశారు. జగన్ వైఖరి రాష్ట్ర ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఆయన చర్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

# తుని రైలు దగ్ధం కేసు... ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : తుని రైలు దగ్ధం కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన స్పష్టత ఇచ్చింది. ఈ కేసులో రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళ్లకూడదని ప్రభుత్వం నిశ్చయించింది. కేసును మళ్లీ తిరగదోడే ఉద్దేశం తమకు ఎంతమాత్రం లేదని సర్కార్ తేల్చిచెప్పింది. ఈ కేసులో హైకోర్టులో అప్పీల్ చేయాలంటూ జారీ అయిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. అంతేకాకుండా, ఏ స్థాయిలో, ఎవరి ఆమోదంతో ఈ అప్పీల్ ఫైల్ ముందుకు నడిచిందనే విషయంపై సమగ్రంగా ఆరా తీయాలని కూడా ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం, ఆర్‌పీజీ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగానే అప్పీల్ కోసం గతంలో ఉత్తర్వులు వెలువడినట్లు ప్రభుత్వం గుర్తించింది. భవిష్యత్తులో ఇటువంటి చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ప్రభుత్వం నుంచి అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇటువంటి ప్రతిపాదనలు, చర్యల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం.అప్పీల్‌కు వెళ్లాలన్న పాత ఉత్తర్వులను రద్దు చేస్తూ అధికారికంగా జీవో త్వరలోనే వెలువడనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ తాజా నిర్ణయంతో తుని కేసుకు సంబంధించి కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# గంజాయి బ్యాచ్ ఇంటికి జగన్ వెళుతున్నారు: అనిత



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : రాజకీయ ప్రయోజనాల కోసం తెనాలి ఘటనకు కులం, మతం రంగు పులుముతున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విజయవాడ సత్యనారాయణపురం మోడల్ పోలీస్ స్టేషన్‌ను డీజీపీతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.. తెనాలి ఘటనకు సంబంధించిన యువకులపై పలు కేసులు ఉన్నాయని, పోలీసులపైనే వారు చేయి చేసుకున్నారని డీజీపీ వెల్లడించారని అనిత గుర్తు చేశారు. అలాంటి గంజాయి బ్యాచ్ ఇంటికి వైసీపీ అధినేత జగన్ వెళుతున్నారని.. రాజకీయ లబ్ధి పొందడానికి, కులమతాలను రెచ్చగొట్టడానికేనని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగితే, తమ కార్యకర్తలకు బీపీ వచ్చిందని జగన్ సమర్థించుకున్నారని గుర్తుచేశారు.వైసీపీ హయాంలో మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై కొట్టినా, రాజమండ్రిలో ఇసుక మాఫియాపై మాట్లాడిన వరప్రసాద్‌కు పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేసినా ఆనాడు జగన్ ఎందుకు స్పందించలేదని, వారి ఇళ్లకు వెళ్లి ఎందుకు పరామర్శించలేదని అనిత నిలదీశారు. పులివెందులలో మహిళ హత్యకు గురైనప్పుడు తాము వెళితే కేసు పెట్టారని అన్నారు. తమ ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు, హౌస్ అరెస్టులు లేవని, పోలీసులను స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలని ఆమె స్పష్టం చేశారు.

# ఆపరేషన్ కగార్‌ను ఆపాలి విప్లవకారులతో చర్చలు జరపాలి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆపరేషన్ కగార్‌ను ఆపాలని అదే విధంగా ఆదివాసుల పైన వారికి నాయకత్వం వహిస్తున్న విప్లవకారులపై సాగిస్తున్న మారణకాండను వెంటనే ఆపివేయాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివాస కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా చేసిన విలేకరుల సమావేశంలో టేబుల్ సమా వేశానికి అధ్యక్షత వహించిన పోరాకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ పౌర హక్కులను కాల రాస్తున్నారని ఆయన ఆరోపించారు. చత్తీస్గడ్ ప్రాంతంలో గత జనవరి నుండి మావోయి స్టుల అణచివేత పేరుతో అనేక మంది ఆదివాసులను విప్లవకారులను కాల్చి చంపుతున్నారని ఆయన విమర్శించారు. ఒకపక్క ఆదివాసులకు నాయకత్వం ఇస్తున్న విప్లవకారులు, పౌర హక్కుల సంఘ నేతలు చర్చలకు సిద్ధమని అనేక విజ్ఞప్తులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తూ ఆదివా సుల హనానానికి పాల్పడుతుందని అన్నారు. అనంతరం ప్రజాసంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో ఉన్న ఖనిజ సంపదను దారా దత్తం చేసేందుకు ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించిందని అన్నారు. పౌర హక్కులను కాపాడుతామని రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభు త్వం ఫలానా తేదిల్లో మొత్తం విప్లవకారులని హతమార్చామని అనడం ఆ ప్రజా స్వామ్య కమని వ్యక్తులు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదివాసులకు నాయకత్వం ఇస్తున్న విప్లవకారులతో శాంతి చర్చలు జరిపి ఆదివాసులపై జరుగుతున్న మారణకాండను ఆపివేయాలని అన్నారు. ఆదివాసుల హక్కుల సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయు నాయకులు పోలారి, సినియర్ జర్నలిస్ట్ డాని, ఎన్టీఆర్ జిల్లా సిపిఐ కార్యదర్శి దోనేపూడి శంకర్, ఐఎపిల్ మెంబర్ పిచ్చుక శ్రీనివాస్, కే ఎన్ పి ఎస్ కృష్ణ, చైతన్య మహిళా సంఘం లక్ష్మి, ఐఎఫ్టీయు నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సి. రాఘవాచారి మీడియా అకాడమి, ఆంధ్రప్రదేశ్, ఛైర్మన్‌గా

# ఆలపాటి సురేశ్ కుమార్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : సి. రాఘవాచారి మీడియా అకాడమి, ఆంధ్రప్రదేశ్, ఛైర్మన్‌గా తనను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆలపాటి సురేశ్ కుమార్ సభా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. స్థానిక రెవిన్యూ కాలనీలో సి. రాఘవాచారి మీడియా అకాడమి కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు మెరుగు పరచేందుకు తాను అత్యంత ప్రాధాన్యత యివ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. మీడియా విస్తృతి, సంక్లిష్టత కారణంగా యీ నిర్ణయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మీడియా అకాడమి ప్రాథమిక విధుల్లో ఇది ఒకటని ఆయన యీ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా, "సోషల్ మీడియా"ను దృష్టిలో వుంచుకుని అవసరమైన సందర్భాల్లో నియంత్రణ చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సరియైన సమాచారాన్ని పొందడం లో యిది ఒక భాగమే కనుక మీడియా అకాడమి పరిధిలో లేకపోయినా, యీ విషయంపై దృష్టి సారించాల్సివుంటుందన్నారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేశ్ కుమార్‌కు సూచించారు. సి. రాఘవాచారి మీడియా అకాడమి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆలపాటి సురేశ్ కుమార్‌కు APUWJ, APWJF నేతలు ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు IJU జాతీయ కార్యదర్శి డి. సోమ సుందర్, హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డప్ప, సమాచార శాఖ మంత్రి వర్యుల అదనపు పి.ఎస్. డా. అనిత, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి ఎల్. స్వర్ణ లత, జాయింట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, విశ్రాంత అడిషనల్ డైరక్టర్ దాసరి శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. మీడియా అకాడమి సెక్రెటరీ మణిరాం నూతన ఛైర్మన్‌కు స్వాగతం పలికారు. ఆలపాటి సురేశ్ కుమార్, సి. రాఘవాచారి మీడియా అకాడమి ఛైర్మన్ నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో ఉన్నతమైన సేవలందించారన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఛైర్మన్ సురేశ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పాత్రికేయులు వారిని అభినందించి సత్కరించారు.

# నిజాయితీ అనేది పుట్టుకతోనే ఉంటుంది, కులం మరియు మతం ద్వారా కాదు...: రజనీకాంత్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : సూపర్ స్టార్ రజనీకాంత్ ఒడిలో కూర్చున్న ఈ పిల్లవాడు తమిళనాడు లో నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమయ్యాడు. మహ్మద్ యాసిన్ అనే బాలుడికి రోడ్డుపై 50 వేల రూపాయలు దొరికినవి, అతను నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆ డబ్బును పోలీసు అధికారికి ఇచ్చి "నాకు ఈ డబ్బు రోడ్డుపై దొరికింది దీని యజమాని ఎవరో కనుగొని దానిని తిరిగి వారికి ఇవ్వండి" అని అన్నాడు. దానికి పోలీస్ అధికారి ఆ పిల్లవాడిని ఈ డబ్బును నువ్వు ఎందుకు ఉంచుకోలేదని అడిగాడు. అంటే దానికి యాసిన్ ఈ డబ్బు ఎవరో కష్టపడి సంపాదించిన డబ్బు నాది కాదని దానిని నా దగ్గర ఎలా ఉంచుకోగలనని బదులిచ్చారు. అతని నిజాయితీని మెచ్చిన పోలీసు అధికారి నీకు నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పమని యాసిన్‌ను అడిగాడు. వెంటనే యాసిన్ నాకు సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను కలవాలనే కోరిక ఉందని చెప్పాడు. వెంటనే పోలీసులు ఇట్టి విషయాన్ని సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు తెలియజేయగా అందుకు స్పందించిన రజనీకాంత్ యాసిన్‌ను తన వద్దకు తీసుకు రమ్మని తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ ఆ పిల్లవాడి తల్లిదండ్రులకు ఈ పిల్లవాడి చదువు ఖర్చులన్నింటినీ తాను భరిస్తానని వాగ్దానం చేశాడు. అతను ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పాఠశాల/కళాశాలలో చదువు కోవచ్చని తెలిపారు. ఇప్పటి నుండి నేను ఈ బిడ్డను నా సొంత కొడుకులా చూసుకుంటానన్నారు. నిజాయితీ అనేది పుట్టుకతోనే ఉంటుంది, కులం మరియు మతం ద్వారా కాదని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు.

# క్యాపిటల్ హాస్పిటల్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : భారతదేశంలోనే తొలిసారిగా, విజయవాడలోని క్యాపిటల్ హాస్పిటల్స్‌లో చీఫ్ సిటీ సర్జన్ అయిన డాక్టర్ కె. హేమకృష్ణసాయి, ఒక రోగికి "ఎఆర్టిక్ రూట్ ఎన్‌లార్జ్‌మెంట్ వయా బోయాంగ్ టెక్నిక్‌తో పాటు బృహద్ధమని వాల్వ్ రీప్లేస్మెంట్, మిట్రల్ వాల్వ్ రీప్లేస్మెంట్. ఎల్ ఏ రిడక్షన్ & ట్రైకస్పిడ్ వాల్వ్ రిపేర్"ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం పోరంకిలోని క్యాపిటల్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కృష్ణ సాయి మాట్లాడుతూ "2021లో డాక్టర్ బోయాంగ్ ప్రవేశపెట్టిన వై-ఇన్సిషన్ టెక్నిక్‌ని ఉపయోగించి భారత దేశంలో మొదటిసారిగా మేము చాలా సంక్లిష్టమైన మరియు అరుదైన ప్రక్రియను నిర్వహించామన్నారు. దీనివలన వాల్వ్-ఇన్-వాల్వ్ విధానాల ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. విజయవాడలోని గుణదలలో నివసిస్తున్న 31 ఏళ్ల చిక్కాల కోటేశ్వరి 5 సంవత్సరాలుగా చిన్న బృహద్ధమని మూల వ్యాధితో బాధపడుతు న్నారు. పలు ఆసుపత్రిలలో సంప్రదించినా సరైన స్వస్థత కనిపించకపోవ డంతో క్యాపిటల్స్‌లో సంప్రదించగా ఆమెకు ట్రిపుల్ వాల్వ్ సర్జరీతో బృహద్ధమని మూల విస్తరణ అనే శస్త్ర చికిత్సతో పరిపూర్ణ ఆరోగ్యవంతురాలు అయ్యే విధంగా చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ హేమకృష్ణ సాయితో పాటు చీఫ్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీధర్ సహాయంతో మరియు చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వివిఎస్ఆర్ భూపాల్‌ల టీమ్‌తో కలిసి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్స మా సర్జన్ మరియు క్యాపిటల్ హాస్పిటల్స్‌ను అత్యుత్తమ కేంద్రంగా గుర్తింపు ఇస్తోంది అని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.సురేష్ చెప్పారు. డాక్టర్ హేమ కృష్ణసాయితోపాటు వారి నిపుణుల బృందం సాధించిన అద్భుతమైన విజయం అని ఈ నిపుణుల బృందంతో అన్ని రకాల కార్డియాక్ సర్జరీలను నిర్వహించ డానికి మేము ఎప్పుడూ అందుబాటులో వుంటామని క్యాపిటల్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరీష్ మన్నె అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందంతోపాటు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెల్లం తినడం వల్ల కలిగే 18 ప్రయోజనాలు.



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : (1) బెల్లం తినడం వల్ల గ్యాస్ ఉబ్బరం పూర్తిగా తగ్గిపోతుంది (2) భోజనం చేసిన తర్వాత తీపి తినాలనిపించడం సహజం. అన్నిటిని మించి బెల్లాన్ని సేవించినట్లయితే మనం ఆరోగ్యం గా ఉండవచ్చు. (3) జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది (4) బెల్లం శరీరంలో ని రక్తాన్ని శుద్ధి చేసి మెటబొలిజం ని క్రమబద్దీకరణ చేస్తుంది.ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు లేదా నీటి తో బెల్లాన్ని సేవించినట్లయితే పొట్టని చల్లబరిచి గ్యాస్ ఉబ్బరాన్ని నివారిస్తుంది ఎవరికైతే గ్యాస్ ప్రాబ్లమ్ ఉంటుందో వారు ప్రతిరోజూ ఈ బెల్లాన్ని భోజనం అనంతరం తప్పనిసరి చేయాలి. (5) బెల్లంలో వుండే ప్రముఖ ధాతువు ఇనుము. కావున బెల్లాన్ని ఎనీమియా రోగులకు ఇచ్చినచో మంచి ఫలితం ఉంటుంది. మరీ ముఖ్యంగా మహిళలు బెల్లాన్ని సేవించడం అత్యావశ్యకమైనది. (6) చర్మం కోసం, బెల్లం రక్తం లోని ప్రమాదకరమైన టాక్సిన్ల ను దూరం చేసి చర్మానికి మంచి మెరుపు నిచ్చి మొటిమలు ని నివారిస్తుంది. (7) బెల్లం యొక్క గుణం వేడిచేయడం.కావున దీనిని మనం జలుబు ,దగ్గు, రొంపలాంటివాటికి ఉపశమనం ఇస్తుంది.జలుబు వలన బెల్లం తినలేనట్లయితే చాయ్ లేదా లడ్డు లో కూడా వాటిని కలిపి సేవించవచ్చు. (8) శక్తి కోసం, బాగా నీరసం బలహీనత లక్షణాలు కనిపించగానే,బెల్లం సేవించినట్లయితే మీ ఎనర్జీ లెవెల్ త్వరగా పెరుగుతుంది. దీని వల్ల షుగర్ లెవెల్ కూడా పెరగదు. రోజంతా పనిచేసిన తర్వాత మీకు అలసట గా అనిపిస్తే వెంటనే బెల్లాన్ని తినేయండి. (9) బెల్లం శరీర ఉష్ణోగ్రత ని నియంత్రణ లో ఉంచుతుంది. దీని ఆంటి అలెర్జిక్ తత్వం వలన దమ్ము ఆస్తమా రోగులు తీసుకొంటే మంచి ఫలితాలు వుంటాయి. (10) మోకాళ్ళ నొప్పులకి విశ్రాంతి, బెల్లం ముక్కతో కొద్దిగా అల్లం కలిపి తీసుకుంటే, మోకాళ్ళ నొప్పులు తగ్గిపోతాయి. (11) బెల్లంతో కలిసి చేసిన పరమాన్నం తింటే గొంతు మరియుమాట హాయిగా వస్తాయి. (12) బెల్లాన్ని నల్లనువ్వుల తో పాటు లడ్డు చేసుకోని తింటే చలికాలంలో ఆస్తమా ఇబ్బంది పెట్టదు. (13) శీతకాలంలో నంజు బాగా తయారైతే బెల్లాన్ని పాపిడి రూపంలో చేసుకుని తినేయండి (14) బెల్లాన్ని నెయ్యితో కలిపి తీసుకొంటే చెవి నొప్పి పూర్తిగా తగ్గిపోతుంది. (15) భోజనము తర్వాత బెల్లం తీసుకొంటే అసిడిటీ తగ్గిపోతుంది. (16) ఐదు గ్రాముల శొంఠి పది గ్రాముల బెల్లం ఉండలుగా చేసి తీసుకొంటే జాండిస్ (పీలియావ్యాధి)పచ్చ కామెర్లు వారికి లాభసాటిగా ఉంటుంది. (17) బెల్లం హాల్వా తీసుకొంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. (18) అయిదు గ్రాముల బెల్లం అంతే పరిమాణంలోని ఆవాల నూనె (మస్తర్డ్ ఆయిల్) తో కలిపి తీసుకొంటే శ్వాస సంభందిత వ్యాధులు నయమవుతాయి.

## పధానమంత్రి మోడీ ఫిట్నెస్ మంత్ర యోగ ఆక్యుప్రెషర్‌తో ప్రపంచ ఆరోగ్యం మరియు శాంతి

*-యోగ శక్తి సాధనా సమితి*

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆరోగ్యానికి, శాంతికి భారతదేశపు యోగులు లక్షలాదిమంది మోడల్స్‌గా ఉన్నారని అలాంటి వారిగా తయారవ్వటానికి ప్రధానమంత్రి ఫిట్నెస్ మంత్ర ఉపయోగపడుతుందని యోగ శక్తి సాధనా సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. యోగాలోని ఐదు కోశాలు 1అన్నమయ కోశా 2 ప్రాణమయ 3 మనోమయ 4 జ్ఞానమయ మరియు 5 ఆనందమయ కోశాలలో ప్రాణమయకోశ ప్రాధాన్యత మేరకు అందుబాటుతనం, వాడకం తక్కువ ఉండటం ప్రజలందరికీ ప్రాణమయ కోశా శిక్షణ, చికిత్సలు అందుబాటులోనికి తెచ్చి ఆరోగ్యం ఆనందం మరియు పూర్ణ ఆయుష్ అందించే లక్ష్యంతో ఏర్పడ్డ యోగ శక్తి సాధనా సమితి భారత ప్రధాన మంత్రి మోడీ అందించిన ఫిట్నెస్ మంత్రని ఇంటింటికి చేరువ చేయడంతో సాధించవచ్చునని ఇంటర్నేషనల్ యోగ డే 2025 కార్యక్రమాలలో భాగంగా 21 రోజులపాటు జరిగే ఉత్సవాలలో యోగ శక్తి సాధన సమితి కేంద్ర కార్యాలయం వద్ద రాష్ట్ర తెలుగుదేశం పార్టీ లీడర్ వెలగపూడి శంకరబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంకు వచ్చిన అందరికి మోడీ హెల్త్ కేర్ స్టిక్స్ పంపిణి చేసారు. ప్రార్ధన, నమస్కారముద్రలో ఓంకార ప్రాణాయామ, మోడీ హ్యాండ్ స్టిక్ వాడకము-ఆరోగ్య ప్రయోజనాలు, మెడిటేషన్, చెవుల మర్ధన, బేర్ ఫుట్ వాక్- ప్రయోజనాలు తెలిపి, నాడీ శోధన చేసి వ్యక్తిగత డైట్ ప్లాన్ మరియు చికిత్స ప్లాను ఇవ్వటంతో ఎవరి ఆరోగ్యం వారే పొందే లాగా ఇకముందు అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యం, ఆనందం గురించి అవగాహన కలిగించినట్లు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. 'యోగాంధ్ర' ప్రజారోగ్య కార్యక్రమం ఏర్పాటు చేసి, ప్రజలకు యోగ త్వరితగతిన చేరువ చేయడానికి విశాఖపట్నంలో ప్రధానమంత్రి సే జూన్ 21న ప్రారంభించడానికి దాని ముందు ఒక నెలపాటు రాష్ట్రమంతా జరిగే సన్నాహ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశమంతా గుర్తించే లాగా ఖ్యాతి గడించారని డాక్టర్ మకాల సత్యనారాయణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అతిధిగా ఆంధ్రప్రదేశ్ మహిళా పారిశ్రామిక సంఘం సెక్రటరీ కానూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఎస్పా భారత్ ఉపాధ్యక్షుడు భూతపాటి ఉదయ్‌కుమార్, సయ్యద్ అఫ్రష్నిసా, ప్రభావతి, వెలగపూడి శ్రీదేవి,యూ బి రామరాజు, విఠల్, యోగశక్తి సాధన సమితి కార్యదర్శి కొండవీటి సుమతి కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సేవలు అందించారు.

## బెయిల్ పై బయటకు రాగానే మరో కేసులో అరెస్ట్ అంటూ జైలుకు పంపుతున్నారు



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. ఆటవిక దేశాల్లోని నియంతల పాలనలో కొనసాగే అరాచకాన్ని ఏపీలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. రెడ్ బుక్ పేరుతో అధికార దుర్వినియోగానికి పోలీసు యంత్రాంగాన్ని వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. చట్టాల ప్రకారం పని చేయాల్సిన పోలీసులు ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నారని విమర్శించారు. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్, పార్టీ నేత తురకా కిశోర్ లను సజ్జల పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం, అరెస్ట్ చేయించడం వంటి పనులను కూటమి ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను పెద్ద సంఖ్యలో అరెస్ట్ చేసి, జైలుకు పంపించారని అన్నారు. ఆ తర్వాత వైసీపీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేశారని మండిపడ్డారు. సామాన్యులు, జర్నలిస్టులపై కూడా రాజ్యహింసను ప్రయోగిస్తున్నారని దుయ్యబట్టారు. నందిగం సురేశ్ పై 12 కేసులు పెట్టారని... ఒకదాని తర్వాత మరో కేసు నమోదు చేయడం... బెయిల్ పై బయటకు రాగానే పాత కేసులో అరెస్ట్ అంటూ మళ్లీ జైలుకు పంపడం చేస్తున్నారని సజ్జల మండిపడ్డారు. ఆయన బెయిల్ పై బయటకు రాగానే మరో పీటీ వారెంట్ తో రెడీగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారన్న రాజేంద్రప్రసాద్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇటీవల కమెడియన్ అలీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కొన్ని రోజుల కిందట కూడా ఆయన ఇలాంటి వ్యాఖ్యలే చేసి చర్చనీయాంశంగా మారారు. ఈ వ్యాఖ్యలను తప్పుబడుతుండడంతో పట్ల రాజేంద్రప్రసాద్ తాజాగా వివరణ ఇచ్చారు. ఇవాళ 'షష్టిపూర్తి' చిత్ర యూనిట్ విజయోత్సవ సభను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రప్రసాద్, తాను ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని, తాను ఎప్పుడూ సరదాగా ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. సంగీత దర్శకుడు ఇళయరాజా పుట్టినరోజైన జూన్ 2న ఈ సక్సెస్ మీట్ జరుపుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని రాజేంద్రప్రసాద్ అన్నారు. "ఆయనకు నేనంటే ఎంతో అభిమానం, ప్రేమ. ఈ మధ్య కొన్ని కార్యక్రమాల్లో నేను మాట్లాడిన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. అది మీ సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. వాటిని తప్పుగా అర్థం చేసుకోవడం మీ ఖర్మ. నేనైతే ఇలానే ఎప్పుడూ సరదాగానే ఉంటాను. మీడియాను నా కుటుంబంగా భావిస్తాను. నన్ను మీరంతా అన్నయ్య అని పిలవడం నా అదృష్టం" అని ఆయన తెలిపారు. ఇటీవల ఓ కార్యక్రమంలో తాను పరిచయం చేసిన హీరోయిన్, నటుడి గురించి సరదాగా మాట్లాడిన మాటలను కూడా తప్పుగా ప్రతికూలంగా ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఇలానే ఉంటాను. ఎందుకంటే అన్నయ్యను కాబట్టి. పెళ్లి (పెళ్లిపుస్తకం) నుంచి షష్టిపూర్తి వరకూ కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా సాగడం ఇండస్ట్రీలో ఏ నటుడికి దక్కని అరుదైన అవకాశం. మీ అందరూ ఈ సినిమాను ఆదరించినందుకు ధన్యవాదాలు" అని రాజేంద్రప్రసాద్ చెప్పారు. నటన గురించి మాట్లాడుతూ, "మనం నటించే సినిమాల్లో మనం కనిపించకూడదు, పాత్రలే కనిపించాలి. నాతో పనిచేసిన నటీనటులంతా నాతో సరదాగానే ఉంటారు. అందులో తప్పేం లేదు" అని ఆయన వివరించారు.

## విజయవాడలో యువ అథ్లెట్లను ప్రోత్సహించడానికి డాబర్ గ్లూకోజ్ 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : హౌస్ ఆఫ్ డాబర్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ ఎనర్జీ డ్రింక్ అయిన డాబర్ గ్లూకోజ్, యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి మరియు భారతదేశం అంతటా ఉన్న ప్రధాన క్రీడా అకా డమీలలోని యువ అథ్లెట్లలో శక్తి మరియు స్టామినా యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి 'ఎనర్జైజ్ ఇండియా' అనే మెగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా, డాబర్ గ్లూకోజ్ విజయవాడలోని ఐజిఎంసి బాక్సింగ్ అకాడమీలో శక్తి మరియు స్టామినా నిర్వహణపై ప్రత్యేక అవగాహన సెషన్‌ను నిర్వహించింది.

విజయవాడలోని అకాడమీలో, ఈ రంగంలో ప్రఖ్యాత వైద్యుడు, కోచ్‌లు, డాబర్ ఇండియా నుండి పి.ఇసాక్, బి.రాజారమేష్ & దినేష్‌కుమార్ ఉన్నారు. ఈ సెషన్ అథ్లెట్లు వారి పనితీరును ఆప్టిమైజ్ చేయడానికి మరియు వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడంలో సహాయపడటానికి విలువైన అంతర్దృష్టులు మరియు వ్యూహాలను అందించింది.

ఈ అకాడమీకి చెందిన అగ్రశ్రేణి అథ్లెట్లు సుతాన్వి, సుశ్రుత & సూర్య ప్రణవ్‌లను కూడా డాబర్ సత్కరించింది. "యువ అథ్లెట్లలో శక్తి మరియు సత్తువ యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి మరియు వారి సంబంధిత క్రీడలలో రాణించడానికి అవసర మైన శక్తిని అందించడానికి మా 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించడం మాకు సంతోషంగా ఉంది. ఒక బ్రాండ్‌గా, డాబర్ గ్లూకోజ్ అథ్లెట్లు, క్రీడా ఔత్సాహికులు మరియు చురుకైన జీవనశైలిని నడిపించే వ్యక్తులకు సరిగ్గా సరిపోతుంది. శారీరక కార్యకలా పాలలో నిమగ్నమైన వ్యక్తులకు అవసరమైన తక్షణ శక్తిని అందించడానికి ఈ ఉత్పత్తి రూపొందించబడింది.'' అని డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్-హెల్త్ సప్లిమెంట్స్ అమిత్ గార్గ్ అన్నారు. స్పోర్ట్స్ పర్సన్, పి. ఇసాక్ కోచ్ నిర్వహించిన ఎనర్జీ సెషన్‌లు సరైన పనితీరును నిర్ధారించ డానికి సరైన పోషకాహారం మరియు హైడ్రేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి యువ అథ్లెట్లకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించాయి. ఈ సెషన్‌లో ఏ అథ్లెట్‌కైనా కీలకమైన స్టామినా మరియు ఓర్పును మెరుగుపరచడానికి చిట్కాలు మరియు పద్ధతులు కూడా ఉన్నాయి.

"మా యువతలో ఆరోగ్యకరమైన మరియు చురుకైన జీవనశైలిని ప్రోత్స హించడానికి డాబర్ గ్లూకోజ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది. యువ అథ్లెట్లతో ఈ భాగస్వామ్యం ఈ లక్ష్యాన్ని సాధించడానికి మరో అడుగు ముందుకు వేస్తుంది. దాని రిఫ్రెష్ రుచి మరియు తక్షణ శక్తి బూస్ట్‌తో, యువ అథ్లెట్లు శక్తివంతంగా ఉండటానికి మరియు వారి ఉత్తమ ప్రదర్శన ఇవ్వడానికి డాబర్ గ్లూకోజ్ సరైన ఎంపిక" అని గార్గ్ జోడించారు.




# తెలంగాణ వార్తలు



## ఆ విషయం కవిత స్వయంగా చెప్పారు: మంత్రి శ్రీధర్ బాబు



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందన్న తమ వాదన నిజమని కేసీఆర్ కుమార్తె కవిత వ్యాఖ్యలతో రుజువైందని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ రెండు పార్టీలు కలిసి నడుస్తున్నాయని కవిత స్వయంగా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో ఇదే అంశాన్ని తాము ప్రస్తావిస్తే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పెద్దఎత్తున హడావుడి చేశారని, ఇప్పుడు కవిత చేసిన వ్యాఖ్యలపై ఆ రెండు పార్టీల నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై స్పందించారు. "బీఆర్ఎస్, బీజేపీ కలిసి ముందుకు సాగుతున్నాయని కవిత స్పష్టంగా చెప్పారు. ఆ రెండు పార్టీల మధ్య ఉన్న బంధాన్ని కేసీఆర్ కుమార్తె స్వయంగా బయటపెట్టారు. దీనిపై ఆ రెండు పార్టీల నేతలు ఏం సమాధానం చెబుతారు?" అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై ఏర్పాటు చేసిన దర్యాప్తు కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఇది ఒక స్వతంత్ర దర్యాప్తు కమిషన్ అని, అటువంటి కమిషన్‌ను రాజకీయ కోణంలో విమర్శించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కమిషన్ తన పని తాను చేసుకుపోతుందని, దానిపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.'జై తెలంగాణ' నినాదం గురించి మాట్లాడుతూ, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి నినాదమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఈ నినాదంపై ఎవరూ పేటెంట్ హక్కులు తీసుకోలేదని, ఇది కేవలం ఒక పార్టీకి మాత్రమే పరిమితమైన నినాదం కాదని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన నినాదమని, దాన్ని సంకుచిత రాజకీయాలకు వాడుకోవద్దని సూచించారు.

## తెలంగాణ జీడీపీతో పోలిస్తే తక్కువ ఉన్నా.. ఆంధ్రప్రదేశ్ అద్భుతంగా అభివృద్ధి చెందుతోంది: ఈటల రాజేందర్



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ జీడీపీ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, ఏపీ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుంటే, తెలంగాణ మాత్రం వెలవెలబోతోందని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'పెద్దన్న' అంటూ ప్రశంసించి, రాష్ట్రానికి తిరిగి వచ్చిన తర్వాత విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అణచివేసిందని, చివరికి తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించిందని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావం కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అన్ని రాజకీయ పక్షాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేశాయని ఈటల గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో బీజేపీ అన్ని విధాలుగా సంపూర్ణ సహకారం అందించిందని తెలిపారు. అయితే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాటు నిరంకుశ పాలన సాగించారని విమర్శించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని, బీఆర్ఎస్ పార్టీపై నెపం మోపి కాంగ్రెస్ తప్పించుకోవాలని చూస్తోందని ఈటల ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కల్లలు చేశాయని ఈటల విమర్శించారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణను గట్టెక్కించడం తమతోనే సాధ్యమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుతో తాను ఎందుకు కలుస్తానని ప్రశ్నించిన ఈటల, రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఒక్క అవినీతి, అక్రమాలపైనైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందా? అని ప్రశ్నించారు.

## సాహితీ, కళా రంగాల్లో విశేష సేవలందించిన వారికి పురస్కారాలు



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సాహితీ, కళా రంగాల్లో విశేష సేవలందించిన తొమ్మిది మంది ప్రముఖులను ఘనంగా సత్కరించింది. ఈ ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వీరికి పురస్కారాలు అందజేశారు. ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున నగదు పురస్కారాలను అందించారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలోనూ, సాంస్కృతిక వైభవ వ్యాప్తిలోనూ కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలను గౌరవించే ఉద్దేశంతో ఈ పురస్కారాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎక్కా యాదగిరి, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరి స్వయంగా సీఎం చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. గోరటి వెంకన్న, గద్దర్, గూడ అంజయ్య, బండి యాదగిరిలకు చెందిన పురస్కారాలను వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ కీర్తిని నలుదిశలా వ్యాపింపజేసిన మహనీయులను గౌరవించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

## నాలుగు కోట్ల మంది ఆకాంక్షను కేసీఆర్ నెరవేర్చారు: కేటీఆర్

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒంటిరి పోరాటం చేశారని, ఎన్నో అవమానాలను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికాలోని డాలస్ నగరంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు, బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను మహాత్ముడి స్ఫూర్తితో కేసీఆర్ నెరవేర్చారని కొనియాడారు. 2023 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, తెలంగాణ ప్రజల పట్ల తమ ప్రేమ ఏమాత్రం తగ్గలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూడేళ్లలో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంతో మంది ప్రాణత్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా తెలంగాణ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అదే పట్టుదలతో, స్ఫూర్తితో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఖండాలు దాటిన తెలంగాణ బిడ్డల నైపుణ్యాన్ని చూసి తెలంగాణ గడ్డ గర్విస్తోందని, అమెరికాలోని తెలంగాణ వాసులను చూసి తెలంగాణ తల్లి పులకించిపోతోందని కేటీఆర్ అన్నారు. పుట్టిన గడ్డకు వేల మైళ్ల దూరంలో ఉన్నా తెలంగాణ సంస్కృతిని, బతుకమ్మను మర్చిపోకపోవడం అభినందనీయ మన్నారు. 2014 జూన్ 2న అసాధ్యం సుసాధ్యమైన రోజని, దశాబ్దాల కలలు ఫలించిన రోజని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, దేశానికే దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేశామని, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులతో వ్యవసాయానికి పెద్దపీట వేశామని కేటీఆర్ వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ కౌరవుల చేతిలో ఉంది.. మూడేళ్లు ఓపికపడితే మన రాజ్యం వస్తుంది



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మూడేళ్లు ఓపిక పడితే మన రాజ్యం వస్తుందని ఆయన అన్నారు. సోమవారం జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలో మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రం కౌరవుల చేతిలో ఉందని, కాంగ్రెస్ నాయకులకు పాలన చేతకావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలు నిరాశలో ఉన్నారని ఆయన ఆరోపించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణలో వ్యాపార కార్యకలాపాలు మందగించాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది" అని మల్లారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల్లో ఒక్కటీ కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ఉన్న బస్సులను కూడా సరిగా నడపలేకపోతున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ హామీ నీటిమీద రాతగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, ఇంతవరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "కొలువులు ఎక్కడ ఇచ్చారు? యువతకు ఏం సమాధానం చెబుతారు?" అని నిలదీశారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, దీనివల్ల అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని మల్లారెడ్డి ఆరోపించారు. రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతినడంతో దానిపై ఆధారపడి జీవించే కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, మేస్త్రీలు వంటి అనేక మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, సామాన్యులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని, ఏ వర్గం కూడా కాంగ్రెస్ పాలనలో సంతోషంగా లేదని ఆయన అన్నారు. "ఈ ప్రభుత్వ వైఫల్యాల వల్ల అన్ని రంగాలు పడకేశాయి. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మూడేళ్లు ఓపిక పడితే మళ్లీ కేసీఆర్ వస్తారని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు వారి గొయ్యి వారే తవ్వుకుంటున్నారని అన్నారు.

## జై తెలంగాణ అని రేవంత్ అనకపోవడం దారుణం: కవిత

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ దృఢమైన నాయకత్వం, రాజకీయ దార్శనికత వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని ఆమె అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె జాతీయ పతాకంతో పాటు, జాగృతి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారని, వారందరికీ ఉద్యమాభివందనాలు తెలియజేశారు. పోరాటాలు, త్యాగాలతో కూడిన ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకున్న జాగృతి కార్యకర్తలందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జాగృతి నూతన కార్యాలయంలో తొలిసారిగా జెండాలు ఎగురవేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం 'జై తెలంగాణ' అని కూడా పలకలేని దుస్థితిలో ఉండటం అత్యంత దారుణమని, ఇది తెలంగాణ ప్రజల దురదృష్టమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఖరిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అమర వీరులకు జరుగుతున్న అన్యాయంగానే భావిస్తున్నామని ఆమె అన్నారు. అమర వీరులకు ముఖ్య మంత్రి నివాళులు అర్పించేంత వరకు తెలంగాణ జాగృతి తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## నగరంలో బి.సి. చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో బి.సి. చైతన్య వేదిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆదివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో బి.సి. చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బి.సి. చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బి.సీ.లను చైతన్య పరచి బలమైన బి.సి. ఉద్యమం నిర్మిస్తామని అన్నారు. మన ఉద్యమాల ద్వారనే హక్కులు, ఆత్మ గౌరవం స్వయం పాలన సాధ్యమౌతుందని బి.సీ.లు సామాజికంగా విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలల్లో అభివృద్ధి చెందాలని అందుకోసం ఐఖ్యత ఉద్యమాల ద్వారనే సాధ్యమని ఆయన తెలిపారు. ఇటీవల ఏప్రియల్ 30వ తేదీన కేంద్ర ప్రభుత్వం జనగణనలో బి.సి. కుల గణన చేస్తామని ప్రకటించడాన్ని బి.సి. చైతన్య వేదిక స్వాగతిస్తుంది. అలాగే కులగణకు సంబంధించి స్పష్టమైన రూట్ మ్యాప్ విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాంగ వ్యతిరేకమైన ఇ.డబ్ల్యూ.ఎస్. రిజర్వేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2025లో దేశ, రాష్ట్ర జనగణనలో బి.సి/ ఓ.బి.సిల కులాలు నమోదు చేసి ఆ సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాల న్నారు. ఎపిలో మురళీధరరావు కమీషన్ సిఫారసుల మేరకు విద్యా, ఉద్యోగ రంగాలలో 52% వాటాకోసం మనం కృషి చేయాలి. ఇందుకోసం తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలలో 69% పైగా రిజర్వేషన్లు వున్నాయని గుర్తించి, ఆ తరహాలోనే మన రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. క్రీమీలేయర్ విధా నాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వం స్పష్టమైన తన విధానాన్ని ప్రకటించాల న్నారు. బి.సి/ఓ.బి.సి సామాజిక వర్గాలపై కుల వేధింపులు, దాడులు, అత్యా చారాలు ఆరికట్టేందుకు బి.సి (అత్యాచారాల నిరోధ) చట్టంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపకల్పన చేసి పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే, మాతా సావిత్రి బాయి పూలే దంపతులకు కేంద్ర ప్రభుత్వం "భారత రత్న" బిరుదును ప్రధానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఈ సందర్భంగా బి.సి. చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅధ్యక్షుడిగా ఎన్నిక అయిన అన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్‌కి మరియు రాష్ట్ర కార్యవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా బి.సి. చైతన్య వేదిక తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ వంగ అరుణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా పెంద్యాల నారాయణ, మదుగురి సూర్యనారాయణ, మట్టపర్తి సూర్య చంద్రరావు, బొక్కా సత్యనారాయణ, రాష్ట్ర ప్రధనకార్యదర్శిగా లుక్కా వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శిలుగా నందవరుపు శ్రీనివాసులు, పాల సత్యనారాయణ,పితాని శ్రీనివాస్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా వడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు అవుటపల్లి విజయకుమారి, బి.సి. చైతన్య వేదిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

